RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సోమవారం 10-8-2026 | సంచిక: 13 | సంఖ్య: 312 పేజీలు: 8 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి




## ఆదివాసీ గిరులు.. అవకాశాల గనులు



- ఆదివాసీలతో కలిసి డప్పు కొట్టిన చంద్రబాబు..
- ఉత్సాహంగా థింసా స్టెప్పులేసిన సీఎం
- అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యం, డప్పు కొట్టి అలరించిన సీఎం
- దేశానికి ఉన్నట్టే ప్రతి పౌరుడికీ వ్యక్తిగత విజన్ ఉండాలని పిలుపు
- 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే తన సంకల్పమని స్పష్టం చేసిన చంద్రబాబు
- నిబద్ధతతో పనిచేయడమే నిజమైన దేశభక్తి అని ఉద్ఘాటన

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ వారితో మమేకమయ్యారు. డప్పు వాయిస్తూ, థింసా నృత్యకారులతో కలిసి అడుగులు వేస్తూ అందరినీ ఉత్సాహపరిచారు. ఆదివారం విజయవాడలోని అంబేడ్కర్ కళావేదికలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హాజరైన చంద్రబాబుకు గిరిజన మహిళలు, మంత్రి సంధ్యారాణి, ఇతర నేతలు ఘనస్వాగతం పలికారు. సంప్రదాయ థింసా నృత్యం, డప్పు వాయిద్యాల నడుమ సీఎం వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా డప్పు చేతబట్టి వాయించి సభలో కొత్త ఉత్తేజం నింపారు.దఅంతకుముందు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ముఖ్యమంత్రి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, ప్రతి పౌరుడూ దేశం, రాష్ట్రం,

2లో



## బోనమెత్తిన పాతబస్తీ

- కన్నుల పండువగా లాల్‌దర్వాజా బోనాలు
- మొదటి బోనం సమర్పించిన దేవేందర్ గౌడ్ కుటుంబం
- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్,పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్
- బంగారు బోనమెత్తిన కొండా సురేఖ.. అలరించిన పోతరాజులు

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి 118వ బోనాల జాతర ఉత్సవాలు ఆదివారం కనుల పండువగా కొనసాగాయి. మహిళా భక్తులు సంప్రదాయ వ్రస్తధారణతో బోనాలను తీసుకురాగా....యువకులు పోతరాజు వేషధారణలో భక్తులను విశేషంగా అలరించారు. శివసత్తుల చిందులతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. జోగినీలు మెట్ల బోనాలతో నృత్యాలు చేస్తూ ముందుకు కదిలారు. తెల్లవారుజామున 3 గంటలకు జల్లి కడువా, 4 గంటలకు బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 5.30 గంటలకు మాజీ

## హర్మూజ్ జలసంధిపై వీడని ఉత్కంఠ..

- అమెరికా, ఇరాన్‌ల పరస్పర విరుద్ధ ప్రకటనలు
- ఇరాన్‌తో పాక్షికంగానే చర్చలు జరుపుతున్నామన్న ట్రంప్
- సైనిక చర్యకు బదులు ఆర్థిక ఒత్తిడి పెంచడానికే మొగ్గుచూపుతున్నామని వెల్లడి
- అమెరికాతో ఎలాంటి చర్చలు జరగడం లేదని మరోసారి స్పష్టం చేసిన ఇరాన్
- హర్మూజ్‌లో తాత్కాలిక మార్గంపై ఒమన్‌తో ఒప్పందానికి దగ్గరగా ఉన్నామని ప్రకటన



ఇరాన్‌తో తాము 'పాక్షికంగానే చర్చలు' జరుపుతున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై కొత్తగా సైనిక చర్యకు ఆదేశించే బదులు, ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచడానికే తాను సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. యాక్సియోస్ వార్తా సంస్థతో ఫోన్‌లో మాట్లాడిన ట్రంప్, ఈ విషయాన్ని తాము పెద్దదిగా చేయడం లేదని అన్నారు. ఆర్థికంగా ఇరాన్ చాలా బలహీనమైన స్థితిలో ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, హర్మూజ్

2లో

## పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్ పరామర్శ..

- రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేత
- నల్లబెల్లిలో దివంగత ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ
- హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసీఆర్
- రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం చెక్కులు అందజేత
- సుదర్శన్‌రెడ్డితో అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగం
- పార్టీ అండగా ఉంటుందని కుటుంబానికి భరోసాం

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్ జిల్లా నల్లబెల్లిలో పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



2లో

## డాక్టర్ ప్రియాంక మృతి బాధాకరం.. నిందితులకు కఠిన శిక్ష తప్పదు

- హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ డాక్టర్ ప్రియాంక మృతి
- మద్యం మత్తులో యువకులు నడిపిన కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు
- ప్రియాంక మృతి ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ తీవ్ర దిగ్భ్రాంతి
- నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూస్తామన్న పవన్
- మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా



రాజమహేంద్రవరంలో కొద్దిరోజుల ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ ప్రియాంక, హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. మద్యం మత్తులో కొందరు యువకులు మితిమీరిన వేగంతో, అత్యంత నిర్లక్ష్యంగా కారు నడిపి ఆమెను ఢీకొట్టడంతో ఈ ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. భవిష్యత్తులో వైద్యురాలిగా సమాజానికి ఎంతో సేవ చేయాల్సిన ప్రియాంక అకాల మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కార్యాలయం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.

మిగతా 2లో



## రాజమండ్రి ప్రమాద ఘటనలో గాయపడిన ప్రియాంక మృతి

- రాజమండ్రి రోడ్డు ప్రమాద బాధితురాలు, మెడికో ప్రియాంక చికిత్స పొందుతూ కన్నుమూత
- సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచిన వైనం
- మరణాన్ని ధ్రువీకరించిన వైద్యులు
- ప్రమాదానికి కారణమైన ఇద్దరు నిందితులు ఇప్పటికే అరెస్ట్

2లో

## ప్రతిష్టంభనకు తెరపడేనా?

- పార్లమెంట్ వర్షాకాల సెషన్‌లో మిగిలింది నాలుగు రోజులే
- 15 రోజుల్లో లోక్‌సభ పనిచేసింది 15.36 గంటలు మాత్రమే
- ప్రతిపక్షాల పట్టుతో సందిగ్ధంలో ఎఫ్‌సీఆర్ఏ సహా కీలక బిల్లులు





## ఇవాళ జరిగిన దాడిలో చనిపోయి ఉండేదాన్ని

- పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ కారుపై రాళ్ల దాడి
- మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లగా ఘటన
- పోలీసుల సమక్షంలోనే దాడి జరిగిందని మమత ఆరోపణ
- దాడిని ఖండించిన బీజేపీ, తమకు సంబంధం లేదని వెల్లడి
- కస్టడీ మరణాన్ని రాజకీయం చేస్తున్నారంటూ మమతపై సువేందు అధికారి విమర్శ

## డాక్టర్ ప్రియాంక మృతి బాధాకరం.. నిందితులకు కఠిన శిక్ష తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

ఈ హృదయవిదారక ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. "డాక్టర్ ప్రియాంక మృతి వార్త నన్ను తీవ్రంగా కలచివేసింది. ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న నిందితులకు కఠిన శిక్షలు పడేలా కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది" అని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విపత్కర సమయంలో ప్రియాంక కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ ప్రమాదానికి బాధ్యులైన వారు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని, వారిని కఠినంగా శిక్షిస్తామని ప్రభుత్వం తరపున హామీ ఇచ్చారు.

## బోనమెత్తిన పాతబస్తీ

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి టి.దేవేందర్ గౌడ్ తనయుడు వీరేందర్ గౌడ్ దంపతులు అమ్మవారికి దేవి మహాభిషేకాన్ని నిర్వహించి మొదటి బోనం సమర్పించారు. ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన బోనాల సమర్పణ సాయంత్రం వరకు కొనసాగింది. బోనాలతో పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌లు పట్టు వస్త్రాలు సమర్పించగా, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బంగారు బోనం సమర్పించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, దానం నాగేందర్, పైడి రాకేష్ రెడ్డి, రాజ్ ఠాకూర్, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆల, సినీ నటులు విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, బేబి సినిమా ఫేం వైష్ణవి చైతన్య, దర్శకుడు వంగ సందీప్ రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మహిళా కమిషన్ చైర్ పర్సన్ గద్వాల విజయ లక్ష్మీ, బీసీ కమిషన్ సలహాదారుడు వి.హనుమంతరావు, మాజీ ఎంపీలు అంజన్ కుమార్ యాదవ్, తలసాని సాయికిరణ్ యాదవ్, నగర పోలీస్ కమిషనర్ వీ.సీ.సజ్జనార్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## హర్మూజ్ జలసంధిపై వీడని ఉత్కంఠ..

జలసంధిలో నౌకల రాకపోకలను నియంత్రించేందుకు అమెరికా, ఇరాన్, ఒమన్ మధ్య ఒక ఒప్పందం కొన్ని రోజులుగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే విషయంపై ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి కూడా స్పందించారు. హర్మూజ్ జలసంధిలో తాత్కాలిక సముద్ర మార్గం ఏర్పాటుపై ఒమన్‌తో తాము ఒక ఒప్పందానికి చాలా దగ్గరగా ఉన్నామని తెలిపారు. ఇరు దేశాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించడం ఆపేంత వరకు ఆ దేశంతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని అరాఘ్చి ఆదివారం టెహ్రాన్‌లో స్పష్టం చేశారు. అయితే, ట్రంప్ వ్యాఖ్యలు గత కొన్ని రోజులుగా పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. హర్మూజ్ జలసంధిని వెంటనే తెరవకపోతే ఇరాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని గత మంగళవారం ఆయన హెచ్చరించారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇరాన్‌తో తాము చాలా మంచి చర్చలు జరుపుతున్నామని చెప్పారు. కానీ, వాషింగ్టన్‌తో ఎలాంటి చర్చలు జరగడం లేదని టెహ్రాన్ వెంటనే ఖండించింది. సోమవారం కూడా ట్రంప్ మాట్లాడుతూ.. "శిరచ్ఛేదం చేసే ముందు ఇరాన్‌కు ఇదే చివరి అవకాశం" అని తీవ్రంగా హెచ్చరించారు. హర్మూజ్ జలసంధిని రేపటికల్లా తెరిచేలా చర్చలు జరుగుతున్నాయని చెప్పినప్పటికీ, ఇరాన్ దానిని తోసిపుచ్చింది.

## రాజమండ్రి ప్రమాద ఘటనలో గాయపడిన ప్రియాంక మృతి



రాజమండ్రిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మెడికో ప్రియాంక మృత్యువుతో పోరాడి ఓడిపోయింది. గత ఐదు రోజులుగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం తుదిశ్వాస విడిచింది. ఓ వైద్యురాలిగా ఎంతో భవిష్యత్తు ఉన్న ప్రియాంక అర్ధాంతరంగా తనువు చాలించడంతో ఆమె కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే, ఆగస్టు 3వ తేదీన తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని ప్రసాదిత్యమాల్ ప్రాంతంలో ప్రియాంక తన స్కూటర్‌పై వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపిన సురవరపు దశ్వంత్, ఆంధ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్ అనే ఇద్దరు యువకులు ఆమె స్కూటర్‌ను ఉద్దేశపూర్వకంగా మూడుసార్లు ఢీకొట్టారు. ఈ ఘటనలో ప్రియాంక తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను రాజమండ్రిలోని స్థానిక ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తరలించారు. అక్కడ ఆమెను కాపాడేందుకు వైద్యులు తీవ్రంగా శ్రమించారు. అయినప్పటికీ ఆమె కోలుకోలేకపోయింది. శుక్రవారం మధ్యాహ్నం 3:25 గంటలకు ప్రియాంక తుదిశ్వాస విడిచినట్టు కిమ్స్ వైద్యులు ప్రకటించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితులు దశ్వంత్, ఆంధ్రూలను ఇప్పటికే అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. కాగా, తన కుమార్తె మృతికి కారణమైన వారిపై సాధారణ ప్రమాద కేసు కాకుండా, హత్య కేసు నమోదు చేయాలని ప్రియాంక తండ్రి డిమాండ్ చేశారు. ఇది కేవలం ప్రమాదం కాదని, ఉద్దేశపూర్వకంగా చేసిన హత్యేనని ఆయన ఆరోపిస్తున్నారు. పోలీసులు కూడా సీసీటీవీ ఫుటేజి పరిశీలించిన అనంతరం, కావాలనే ఢీకొట్టినట్టు గుర్తించారు. హత్యాయత్నం సెక్షన్లతో కేసును మరింత పకడ్బందీగా మార్చారు. ప్రియాంక స్వస్థలం తెలంగాణలోని గద్వాల జిల్లా అయిజ మండలం ఎక్లాస్‌పూర్. ఆమె ఎంబీబీఎస్ అనంతరం రాజమండ్రిలో పీజీ చేస్తోంది. ఇప్పుడు ఆమె మృతితో స్వగ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

# ఆదివాసీ గిరులు.. అవకాశాల గనులు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకురావడం కష్టం కాదు. గిరిజన ప్రాంతాలకు అనుసంధానం పెంచాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో 2,036 గిరిజన ఆవాసాలకు రహదారులను అనుసంధానించాం. ప్రతి ఆదివాసీ కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మిస్తాం. గిరిజనుల ఇళ్లపై సోలార్ పలకలను ఏర్పాటు చేస్తాం. రూ.1,000 కోట్లతో అడవితల్లికి బాటలు వేస్తున్నాం. 2027 డిసెంబరు నాటికి ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా తాగునీటిని అందిస్తాం. డోలీ మోతలు లేకుండా ఫీడర్ అంబులెన్స్‌లు, 108, 104 అంబులెన్స్‌లు ఏర్పాటు చేస్తున్నాం. మారుమూల గ్రామాల్లో సెల్‌సిగ్నల్స్ ఉండేలా టెలికమ్యూనికేషన్స్‌తో ఎంవోయూ చేసుకున్నాం. దేశంలో ఎక్కడా గిరిజనుల కోసం మూడు జిల్లాలు లేవు. తొమ్మిది ఐటీడీఏ సెంటర్లు, గిరిజన కార్పొరేషన్ కూడా ఉన్నాయి. వీటన్నిటినీ అనుసంధానిస్తే అద్భుతాలు సృష్టించవచ్చు' అని స్పష్టంచేశారు. అల్లూరి సీతారామరాజు పోరాట పటిమను, కీర్తిని తెలియజేసేలా భోగాపురం విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టామన్నారు. థింసా మొన్నటి వరకు నృత్యం మాత్రమేనని.. ఇప్పుడు గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కిందని తెలిపారు. గిరిజనులు ఒకప్పుడు పోడు వ్యవసాయం చేసేవారని, ఇప్పుడది ఆగిందన్నారు. ఈ సందర్భంగా గిరిపుత్రుల అభివృద్ధికి 19 సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకున్నారు. సీఎం ఇంకా ఏం చెప్పారంటే.. రాష్ట్రంలో 4.92 లక్షల మంది గిరిజన విద్యార్థులు ఉన్నారు. తల్లికి వందనం పథకం కింద వారికి రూ.650 కోట్లు అందజేశాం. ఒకప్పుడు ప్రైవేటు స్కూళ్లకు వెళ్లే వాళ్లంతా కూటమి ప్రభుత్వం వచ్చాక రివర్స్ గేర్‌లో ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ఐఐటీ ఆలిండియా పరీక్షలు పెడితే మొదటిసారి 21 మంది గిరిజన విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఆ అనుభవంతో విశాఖపట్నం మేకవానిపాలెంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేసి 600 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. వారిలో కనీసం 100 మంది విద్యార్థులు ఆలిండియా పరీక్షల్లో ఉత్తీర్ణులై చరిత్ర సృష్టించాలి. ఆదివాసీ విద్యార్థులను ఏఐ వరకు తీసుకెళ్లడానికి చెన్నై ఐఐటీతో ఎంవోయూ కుదుర్చుకున్నాం. త్వరలోనే గిరిజనులకు ఇంటి వద్దే వైద్యం చేయిస్తాం. గిరిజన ప్రాంతాల్లో ఉంటున్నవారిలో ఎనీమియా ఎక్కువగా ఉంది. ఈ లోపాన్ని త్వరలో నివారిస్తాం. బాధితులకు రూ.10 వేల పింఛన్ ఇస్తున్నాం. గిరిజన ప్రాంతాల నుంచి ప్రకృతి సహజసిద్ధమైన ఉత్పత్తులకు బెస్ట్ బ్రాండ్‌ను తీసుకొస్తాం. సీతంపేట పసుపు, రంపచోడవరం రబ్బరు, పార్వతీపురం పైనాపిల్, తేనె, తాటిబెల్లానికి ప్రపంచ గుర్తింపు, బ్రాండింగ్ తీసుకొస్తాం. చక్కెర తినే రోజులు పోతున్నాయి. తాటిబెల్లమే కదా అనుకోవద్దు. అది ఆరోగ్యానికి మంచిది. కాఫీ, టీ తాగాలంటే తాటిబెల్లం వేసుకునే రోజులు వస్తాయి. గిరిజనులకు సహకరించే అందరినీ దేశం నలుమూలల నుంచీ రప్పించి ఎంవోయూలు చేసుకున్నాం. మన్యం ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఆదివాసీ ఇల్లు ఓ అతిథి గృహం కావాలి. మన్యంలో సుందర ప్రాంతాలు ఉన్నాయి. పాడేరు, అరకు, లంబసింగి.. కశ్మీరు కంటే బాగుంటాయి. కుంకుమపువ్వు, ఆవకాడో పంటలు కశ్మీరులోనే కాదు.. మన మన్యంలోనూ సాగవుతాయి. పాతికేళ్ల కిందట నేనే కాఫీ తోటల సాగును మొదలు పెట్టించాను. దానికి అరకు కాఫీ అని పేరు పెట్టాం. దానిని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడానికి నాంది ఫౌండేషన్ ముందుకొచ్చింది. ప్రధాని మన్‌కీబాత్‌లో అరకు కాఫీ గురించి చెప్పారు. ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లినప్పుడు ఆ దేశ ప్రధానికి అరకు కాఫీ పొడిని బహుమతిగా ఇచ్చారు. నన్ను కలవడానికి వచ్చిన వాళ్లందరికీ ఏమి ఇచ్చినా ఇవ్వకపోయినా.. అరకు కాఫీ మాత్రం కచ్చితంగా ఇస్తాను. దీనిని బెస్ట్ బ్రాండ్‌గా తయారు చేస్తాం. గిరిజన ఉత్పత్తులకు విలువను జోడించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. మైదాన ప్రాంతాల కంటే గిరిజన ప్రాంతాల్లో ఎక్కువ ఆదాయం రావడం ఆనందదాయకం. స్థానిక గిరిజనులకే ఉద్యోగావకాశాలు ఉండాలని నాడు ఎన్టీఆర్ భావించారు. దీనికి నేను 2003లో జీవో నంబర్ 3 జారీచేశాను. 20 ఏళ్లు అమల్లో ఉన్న ఈ జీవోను సుప్రీంకోర్టు కొట్టివేస్తే అప్పుడు సీఎంగా ఉన్న జగన్ సరిగా స్పందించలేదు. ఫలితంగా గిరిజనులు.. ఉన్న హక్కును కోల్పోయారు. ఇప్పుడు మళ్లీ ఈ సమస్య నా వద్దకు వచ్చింది. దీనిని సరిచేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ప్రతి మనిషికీ విజన్ ఉండాలి.

## పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్ పరామర్శ..

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ ప్రకటించిన రూ.2.25 కోట్ల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను కేసీఆర్ స్వయంగా సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. నల్లబెల్లిలోని నివాసానికి చేరుకున్న కేసీఆర్, తొలుత సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సుదర్శన్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. సుదర్శన్‌రెడ్డి అత్యంత సాదాసీదా జీవితం గడిపారని, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మంచి నేత అని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రకటించిన ఆర్థిక సాయంలో భాగంగా సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లల పేరున చెరో రూ.1 కోటి, ఆయన తల్లి అమృతమ్మ సంరక్షణ కోసం రూ.25 లక్షల చెక్కులను కేసీఆర్ అందించారు. పిల్లల చదువులు, భవిష్యత్తుతో పాటు కుటుంబ సంక్షేమ బాధ్యతలను పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్ రాక సందర్భంగా నల్లబెల్లికి బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసం వద్ద జనం కిక్కిరిసిపోవడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి, పరిస్థితిని అదుపులోకి తెచ్చి కేసీఆర్ కాన్వాయ్‌కు దారి కల్పించారు. కేసీఆర్ వెంట పలువురు పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.





## ఇవాళ జరిగిన దాడిలో చనిపోయి ఉండేదాన్ని: మమతా బెనర్జీ

(మొదటి పేజీ తరువాయి)



పశ్చిమ బెంగాల్‌లో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రయాణిస్తున్న కారుపై నిరసనకారులు దాడికి పాల్పడ్డారు. కోల్‌కతా సమీపంలోని ఉత్తర 24 పరగణాల జిల్లా హాలిసహర్‌లో ఈ ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఆమె కాన్వాయ్‌పై కొందరు రాళ్లు, ఇటుకలు, వాటర్ బాటిళ్లు విసిరారు. పోలీసు కస్టడీలో మరణించినట్లు భావిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కార్యకర్త బిర్జూ కియోట్ కుటుంబాన్ని పరామర్శించేందుకు మమతా బెనర్జీ వెళుతుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. దోపిడీ ఆరోపణలపై అరెస్టయిన బిర్జూ, పోలీసుల కస్టడీలో మరణించాడు. ఈ నేపథ్యంలో, మమత పర్యటనను వ్యతిరేకిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఆమె కారును చుట్టుముట్టి, దానిపై బురద పూశారు. "చోర్ భగావో" (దొంగను తరిమేయండి) అంటూ నినాదాలు చేశారు. ఈ దాడిపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. పోలీసుల సమక్షంలోనే గుర్తుతెలియని వ్యక్తులు తన వాహనంపై రాళ్లతో దాడి చేశారని ఆమె ఆరోపించారు. "కారు అద్దాలు మూసి ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డాను. లేదంటే ఆ రాళ్లు తలకు తగిలి నా తల పగిలిపోయేది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని, వారు కేవలం అధికార బీజేపీకి మాత్రమే రక్షణ కల్పిస్తున్నారని మండిపడ్డారు. ఆమెతో పాటు ఉన్న లోక్‌సభ ఎంపీ కల్యాణ్ బెనర్జీ, రాజ్యసభ ఎంపీ డోలా సేన్ కూడా అధికారుల వైఫల్యాన్ని విమర్శించారు. ఈ ఘటనను రాష్ట్ర బీజేపీ చీఫ్ సమీక్ భట్టాచార్య ఖండించారు. ఈ దాడితో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను డిమాండ్ చేశారు. అయితే, సీఎం సువేందు అధికారి దీన్ని మమత సృష్టించిన డ్రామాగా అభివర్ణించారు. కస్టడీ మరణాన్ని రాజకీయం చేసేందుకే మమత బలవంతంగా ఆ ప్రాంతానికి వెళ్లారని ఆరోపించారు. మృతుడి కుటుంబ సభ్యులు అధికారుల తీరుపై సంతృప్తి చెందారని, మరణానికి కచ్చితమైన కారణం తెలియాలని మాత్రమే వారు కోరుకుంటున్నారని తెలిపారు. తన పర్యటనతో మమత ప్రజా జీవితానికి ఆటంకం కలిగించారని విమర్శించారు. ఇటీవలే మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై కూడా ఆయన నియోజకవర్గంలో దాడి జరిగిన నేపథ్యంలో, తాజా ఘటనతో రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

# ప్రతిష్టంభనకు తెరపడేనా?

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు చివరి అంకానికి చేరుకున్నాయి. తీవ్ర ఆందోళనల కారణంగా దాదాపుగా ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండానే రెండు వారాల సమయం గడిచిపోయింది. ఈ సెషన్‌లో ఇక మిగిలింది కేవలం నాలుగు రోజులు మాత్రమే. ప్రభుత్వానికి, ప్రతిపక్షాలకు మధ్య ప్రతిష్టంభన తారస్థాయికి చేరడంతో సభా కార్యకలాపాలు సజావుగా సాగడం కష్టమేనని అంటున్నారు. పరీక్షల అక్రమాలు, పేపర్ లీకేజీలపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసుల లాఠీచార్జి, పెల్లెట్ గన్స్ ప్రయోగంపై హోం మంత్రి అమిత్ షా లోక్‌సభలో స్పష్టమైన ప్రకటన చేయాలని విపక్షాలు పట్టుబడుతున్నాయి. అయోధ్య రామమందిర విరాళాల చోరీ అంశంపై ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నాయి. అయితే సభకు ఏ మంత్రి వచ్చి జవాబు చెప్పాలో ప్రతిపక్షాలు నిర్ణయించలేవని అధికార పక్షం తేల్చిచెప్పడంతో సభలో నిరసనల పర్వం కొనసాగుతోంది. నిరసనలు, నినాదాల నడుమ లోక్‌సభలో 8 బిల్లులకు ఆమోదముద్ర పడింది. లోక్‌సభకు కేటాయించిన మొత్తం 90 పనిగంటల్లో సరిగ్గా నడిచింది కేవలం 15 గంటల 36 నిమిషాలు మాత్రమే. ఈ సమయంలోనూ సింహభాగం, దాదాపుగా 11 గంటలు ఒక్క పరీక్షల అక్రమ మార్గాల నివారణ సవరణ బిల్లు'పై చర్చకే వెచ్చించారు. ఈ బిల్లుపై 48 మంది ఎంపీలు మాట్లాడారు. మిగిలిన 7 ఇతర ముఖ్యమైన బిల్లులను విపక్షాల నినాదాలు, ఆందోళనల మధ్య సమగ్ర చర్చ లేకుండా కేవలం 36 నిమిషాల వ్యవధిలోనే సభ ఆమోదించేసింది. రాజ్యసభ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. 15 రోజుల్లో ఎగువ సభ కేవలం 24.21 గంటలు మాత్రమే సమావేశమైంది. ఈ చివరి నాలుగు రోజుల్లో మరో 7 కీలక బిల్లులను ఆమోదింపజేసుకోవాలని కేంద్రం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. విదేశీ విరాళాల క్రమబద్ధీకరణ (ఎఫ్‌సీఆర్ఏ) సవరణ బిల్లు, ట్రిబ్యునళ్ల సంస్కరణల బిల్లు, 'గనులు--ఖనిజాల అభివృద్ధి సవరణ బిల్లు, 'నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బిల్లు, 'కేరళ పేరు మార్పు బిల్లు'ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉంది. రాజ్యసభలో 'బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ బిల్లు', 'పన్నుల సవరణ బిల్లు'లను ఆమోదింపజేసుకోవాలని భావిస్తోంది. కీలక బిల్లులేవీ సోమవారం సభలో ప్రవేశపెట్టే అవకాశం లేదు. ముఖ్యంగాఎఫ్‌సీఆర్ఏ బిల్లును అనుమతించేదే లేదంటూ కాంగ్రెస్ స్పష్టం చేస్తోంది. 10, 11, 12వ తేదీల్లో సభకు తప్పనిసరిగా హాజరుకావాలంటూ కాంగ్రెస్ తమ ఎంపీలకు విప్ కూడా జారీ చేసింది.

**కుదరని సయోధ్య**

సభలో చోటుచేసుకుంటున్న జాప్యాన్ని, రచ్చను నివారించేందుకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో రెండుసార్లు భేటీ అయ్యారు. ఫోన్‌లోనూ మాట్లాడారు. డీలిమిటేషన్, ఎఫ్‌సీఆర్ఏ బిల్లులపై సహకరించాలని కోరారు. అయినప్పటికీ, తమ డిమాండ్లపై కాంగ్రెస్ ఇతర విపక్షాలు పట్టుబట్టడంతో సయోధ్య సాధ్యం కాలేదు. విద్యార్థులపై దాడి, విరాళాల చోరీ అంశాలపై వెనక్కి తగ్గేది లేదని విపక్షాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లులను, వ్యూహాలను విపక్షాలు ఏ రకంగా అడ్డుకుంటాయో, పార్లమెంట్ చివరి నాలుగు రోజులు ఎలా సాగుతాయి అనేది చర్చనీయాంశమైంది.



## కుమురం భీమ్ ఆశయాలను కొనసాగిద్దాం..

### హక్కుల కోసం కలిసికట్టుగా పోరాడుదాం: సీతక్క

కుమురం భీమ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి సీతక్క

ఆదివాసీల హక్కుల పరిరక్షణకు సమష్టి కృషి అవసరమన్న మంత్రి

భాష, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని సూచన

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 09 (నేటి ప్రస్థానం):** ఆదివాసీల హక్కుల పరిరక్షణ, అభివృద్ధి కోసం కుమురం భీమ్ పోరాట స్ఫూర్తితో అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అశ్వారావుపేటలో నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. స్థానిక కూడలిలో కుమురం భీమ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కులు, స్వయం ప్రతిపత్తి, భూహక్కుల పరిరక్షణకు రాజ్యాంగం ప్రత్యేక అవకాశాలను కల్పించిందన్నారు. సమ్మక్క-సారలమ్మ నుంచి కుమురం భీమ్ వరకు ఆదివాసీల పోరాట చరిత్ర ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తమకు ఎవరిపైనా ద్వేషం లేదని, అయితే రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన హక్కుల కోసం పోరాడుతామని స్పష్టం చేశారు.ఆదివాసీల భూముల సమస్యలు సహా పలు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. పేదలు, నిరక్షరాస్యులు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారులను ఆశ్రయించినప్పుడు వారిని గౌరవంగా చూసి, వారి వినతులను స్వీకరించాలని సూచించారు. భాష, వేషధారణ, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు వాటిని అందించడం గొప్ప బాధ్యత అని సీతక్క పేర్కొన్నారు.

## బీజేపీ వస్తే భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా తీర్చిదుద్దుతాం.. బండి సంజయ్

పాతబస్తీపై బండి సంజయ్ కీలక ప్రకటన.. చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయానికి భారీ హామీ

ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా అభివృద్ధి చేస్తామని, బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని ప్రకటన

కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలపై బండి సంజయ్ తీవ్ర విమర్శలు



**హైదరాబాద్, ఆగస్టు 09 (నేటి ప్రస్థానం):** తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. పాతబస్తీలో బోనాల ఉత్సవాలను భారీగా నిర్వహించడంతో పాటు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.బీఆర్ఎస్ పాలనలో లాల్‌దర్వాజ ఉజ్జయిని మహంకాళి ఆలయ అభివృద్ధికి రూ.20 కోట్లు ఇస్తామని ప్రకటించి అమలు చేయలేదని బండి సంజయ్ ఆరోపించారు. లాల్‌దర్వాజ బోనాలకు కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ.5.50 లక్షలు మాత్రమే కేటాయించిందని, లక్షలాది మంది భక్తులు వచ్చే ఉత్సవాలకు ఈ నిధులు సరిపోవని అన్నారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని విమర్శించారు.బీజేపీ అధికారంలోకి వస్తే పాతబస్తీలో బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని బండి సంజయ్ తెలిపారు. భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా తీర్చిదిద్దడంతో పాటు ఆలయాల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. హిందూ సమాజం ఐక్యంగా ఉండాలని, యువత ఆధ్యాత్మిక స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి సర్పంచ్ రేణుక వెంకటేష్ యాదవ్

**తుర్కపల్లి ,ఆగస్టు 9 :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సర్పంచ్ డొంకెన రేణుక వెంకటేష్ యాదవ్ అన్నారు. ఆదివారం తుర్కపల్లి మండలం తిరుమలపురం గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో ఆదర్శ గ్రామ నిర్మాణంలో భాగంగా విలేజ్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా పలు విషయాల మీద చర్చించారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నివారణ లో భాగంగా విలేజ్లో ప్లాస్టిక్ వాడవద్దని అన్నారు .పర్యావరణంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని అన్నారు. విలేజ్ లో ప్లాస్టిక్ డ్రైవ్ డే నిర్వహించాలని మద్యపానంపై చర్చించారు. సిరిజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ,వాటర్ వేస్ట్ కాకుండా ఆన్ ఆఫ్ పెట్టాలని వివరించారు. ప్లాస్టిక్ నివారణలో ప్లాస్టిక్స్ సంచులు వాడవద్దని, క్లాత్ బ్యాగులను ఇంటికి ఒకటి చెప్పున ఇవ్వడానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, బాలవికాస సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు





## మేడ్చల్ రాఘవేంద్రనగర్‌లో బోనాల సందడి.. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు

రాఘవేంద్రనగర్‌లో అమ్మవారికి బోనాలు సమర్పించిన మహిళలు

పోతురాజుల నృత్యాలు, డప్పు చప్పుళ్లతో వైభవంగా ఊరేగింపు

బోనాల వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

**మేడ్చల్, ఆగస్టు 09 (నేటి ప్రస్థానం):** మేడ్చల్ పట్టణంలోని రాఘవేంద్రనగర్ కాలనీలో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించారు. కాలనీలోని వివిధ వీధుల నుంచి మహిళలు బోనాలతో కూడలి వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి పోతురాజుల నృత్యాలు, డప్పు చప్పుళ్ల నడుమ బోనాలను ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకెళ్లారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఊరేగింపుతో కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, యువకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## కిష్టాపూర్--పూడూరు డివిజన్‌లో మార్మోగిన బోనాల సందడి..

నల్లపోచమ్మకు ఘనంగా బోనాలు

కిష్టాపూర్ అర్చన కాలనీలో వైభవంగా నల్లపోచమ్మ అమ్మవారి బోనాల వేడుకలు

ఊరేగింపుగా వెళ్లి... అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

సంప్రదాయ దుస్తుల్లో బోనాలతో తరలివచ్చిన మహిళలు, భక్తులతో కిటకిటలాడిన ఆలయ పరిసరాలు



**మేడ్చల్, ఆగస్టు 09 (నేటి ప్రస్థానం):** ఆషాఢ బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని మేడ్చల్ సర్కిల్ పరిధిలోని కిష్టాపూర్--పూడూరు డివిజన్ కిష్టాపూర్ అర్చన కాలనీలో నల్లపోచమ్మ అమ్మవారి బోనాల వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో అలంకరించిన బోనాలతో ఆలయానికి తరలిరావడంతో కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం ఘటాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం కాలనీ మహిళలు బోనాలను ప్రత్యేకంగా అలంకరించి నల్లపోచమ్మ అమ్మవారికి సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతూ సందడిగా మారాయి. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ బోనాల వేడుకలో కాలనీ వాసులు, మహిళలు, యువత, భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణలో నక్సలిజం కథ ముగిసినట్టేనా..?

### డీజీపీ సీవీ ఆనంద్ కీలక వ్యాఖ్యలు

ప్రధాన మావోయిస్టు కేడర్ అంతా లొంగిపోయింది.. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఉనికి ఉందన్న డీజీపీ

మాదక ద్రవ్యాలపై ఫోకస్.. పోలీస్ శాఖలో సమూల మార్పులకు కొత్త వ్యూహాలు



**వరంగల్, ఆగస్టు 09 (నేటి ప్రస్థానం):** తెలంగాణలో మావోయిజం, నక్సలిజం ప్రభావం పూర్తిగా తగ్గిపోయిం దని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ప్రధా న మావోయిస్టు కేడర్ అంతా లొంగిపోయిందని, కర్రెగుట్టలు, మరికొన్ని ప్రాంతాల్లో మాత్రమే మావో యిస్టుల ఉనికి ఉన్నట్లు చెప్పారు. లొంగిపోయిన వారికి పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, వారి కుటుంబాలను ఆదుకునేం దుకు కూడా ప్రయత్నిస్తున్నామని వెల్లడించా రు.వరంగల్ జిల్లాలో ఆదివారం పర్యటించిన డీజీపీ సీవీ ఆనంద్.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ములుగులో లొంగిపోయిన మావోయిస్టులతో సోమవారం మాట్లాడనున్నట్లు డీజీపీ తెలిపారు. తన ఐపీఎస్ ప్రస్థానం వరంగల్ నుంచే ప్రారంభమైందని, అప్పటితో పోలిస్తే ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయా యని పేర్కొన్నారు. మావోయిస్టుల సమస్య తగ్గడంతో రాజకీయ నాయకుల భద్రతను పూర్తిగా తొలగిం చకుండా, సెక్యూరిటీ కమిటీ నివేదిక ఆధారంగా అవసరమైన మేరకు తగ్గించామని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని సీవీ ఆనంద్ తెలిపారు. డ్రగ్స్ నివారణకు కొత్త వ్యూహాలను అమలు చేయడంతో పాటు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోలీస్ శాఖలో సంస్కరణలు చేపడుతున్నామని చెప్పారు. గ్రేహౌండ్స్‌తో పాటు కొన్ని ఇతర విభాగాల్లోనూ మార్పులు తీసుకురానున్నట్లు వెల్లడించారు. మొత్తం పోలీస్ శాఖను ఆధునీకరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని డీజీపీ పేర్కొన్నారు.

## శాసనసభలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

రాష్ట్ర చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు

నల్గొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 56 శాతం ఉన్న బీసీలకు జనాభా దామాషా ప్రకారం చట్టసభలలో ఇంతవరకు ప్రాతినిధ్యం దక్కలేదని, బీసీలలో చైతన్యంతోనే జిల్లాలో బడుగు బలహీనవర్గాలకు రాజ్యాధికారం సాధ్యమని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని జి.యల్.గార్డెన్స్ ఫంక్షన్ హాల్ లో ఉమ్మడి నల్లగొండ జిల్లా బీసీఐఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీల హక్కులకై సామాజిక న్యాయ పోరాట సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం వద్ద పెండింగ్ లో ఉన్న 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును వెంటనే రాష్ట్రపతి ఆమోదంతో రాజ్యాంగంలోని 9 వ షెడ్యూలులో చేర్చాలని, చట్టసభలైన లోక్ సభ, శాసనసభలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, తెలంగాణలో స్వతంత్ర కమీషన్ వేసి ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లను పునః సమీక్షించాలని, బీసీల జనాభా దామాషా ప్రకారం కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులు చేయాలని, బీసీ సబ్ ప్లాన్ చట్టాన్ని తీసుకువచ్చి సమర్థవంతంగా అమలుచేయాలనిబీసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లను అమలుచే యాలని విద్యాహక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తూ చట్టంలోని సెక్షన్ 12 (1)(బి) ప్రకారం ప్రైవేట్, కార్పోరేట్ పాఠశాలల్లో బడుగు బలహీన వర్గాల విద్యార్థు లకు 25 శాతం సీట్లు కేటాయించాలని, కార్పోరేట్ విద్యాసంస్థల ఫీజులపై నియంత్రణ చట్టం తీసుకువచ్చి అమలుచేయాలనిజాతీయ కులగణనలో ప్రతి కుటుం బానికి ఒక యూనిక్ నెంబర్ ఇవ్వాలని, తెలంగాణలో ఖాళీగా ఉన్న సుమారు 1.5 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, జీవో 55 ను పునరుద్ధరించాలని, ప్రభుత్వం, న్యాయవ్యవస్థ, విద్య, ప్రభుత్వరంగ సంస్థలు

# వృద్ధులే టార్గెట్..

## 19 నెలల్లో రూ.102 కోట్ల సైబర్ మోసం

**సైబర్ నేరగాళ్ల కొత్త స్కెచ్.. వృద్ధుల ఖాతాలే టార్గెట్**

**సీనియర్ సిటిజన్లను లక్ష్యంగా చేసుకుని ట్రేడింగ్, డిజిటల్ అరెస్ట్, ఓటీపీ మోసాలు**

**19 నెలల్లో 403 కేసులు.. బాధితుల నుంచి రూ.102.02 కోట్ల కాజేత**

**ఫోన్, బ్యాంక్ లావాదేవీలపై కుటుంబ సభ్యుల పర్యవేక్షణ అవసరమన్న సీపీ సజ్జనార్**

**హైదరాబాద్, ఆగస్టు 09 (నేటి ప్రస్థానం):** సీనియర్ సిటిజన్లను ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు. 2025 జనవరి నుంచి 2026 జులై 31 వరకు 19 నెలల వ్యవధిలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల పరిధిలో వృద్ధులకు సంబంధించిన 403 సైబర్ మోసం కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ కేసుల్లో బాధితులు ఏకంగా రూ.102.02 కోట్ల మేర నష్టపోయారని వెల్లడించారు. ట్రేడింగ్ ఫ్రాడ్‌లలోనే 113 కేసులు నమోదు కాగా, వృద్ధులు రూ.55.88 కోట్లను కోల్పోయారని సీపీ తెలిపారు. వాట్సాప్, టెలిగ్రామ్‌ల ద్వారా పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, భారీ లాభాల పేరుతో వల వేసి, నకిలీ యాప్‌లలో లాభాలు వచ్చినట్లు చూపించి సైబర్ కేటుగాళ్లు డబ్బులు కాజేస్తున్నారని చెప్పారు. డిజిటల్



అరెస్ట్ పేరుతో 69 కేసులు నమోదై, రూ.31.93 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. పోలీస్, సీబీఐ, ఈడీ, కస్టమ్స్ అధికారులమంటూ వీడియో కాల్స్ చేసి కేసులు, అరెస్టుల పేరుతో భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని హెచ్చరించారు. ఓటీపీ మోసాల్లో 115 కేసులు నమోదై రూ.4.94 కోట్ల నష్టం వాటిల్లిందని, పెట్టుబడి మోసాలకు సంబంధించి 22 కేసుల్లో రూ.2.79 కోట్లను వృద్ధులు కోల్పోయారని తెలిపారు. సోషల్ మీడియా, డేటింగ్ యాప్‌ల ద్వారా పరిచయాలు పెంచుకుని గిఫ్టులు, కస్టమ్స్ డ్యూటీలు, అత్యవసర ఖర్చుల పేరుతోనూ మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. 2025లో 285 కేసుల్లో రూ.71.81 కోట్ల నష్టం, 2026 తొలి ఏడు నెలల్లో 118 కేసుల్లో రూ.30.20 కోట్ల నష్టం జరిగినట్లు వెల్లడించారు. ఫిర్యాదు అందిన వెంటనే బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసి సొమ్ము రికవరీకి చర్యలు తీసుకుంటున్నామని, వృద్ధుల ఫోన్ వినియోగం, ఆన్‌లైన్ బ్యాంకింగ్ లావాదేవీలపై కుటుంబ సభ్యులు పర్యవేక్షణ ఉంచాలని సీపీ సజ్జనార్ సూచించారు.




## నేటితో ముగియనున్న 'సర్' ప్రక్రియ..

## మీ ఓటు వివరాలు పూర్తయ్యాయా?

**తెలంగాణలో 78.14 % ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి**

**యాదాద్రి భువనగిరి టాప్.. చివరి స్థానంలో హైదరాబాద్**

**3.38 కోట్ల మంది ఓటర్లలో 2.64 కోట్ల ఫారాల డిజిటలైజేషన్ పూర్తి**

**హైదరాబాద్, ఆగస్టు 09 (నేటి ప్రస్థానం):** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ తుది దశకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియకు సోమవారంతో గడువు ముగియనుంది. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా.. ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం ప్రక్రియ పూర్తయింది. డిజిటలైజేషన్‌లో యాదాద్రి భువనగిరి జిల్లా 94.30 శాతంతో మొదటి స్థానంలో నిలిచింది. మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతం, కుమురం భీమ్ ఆసిఫాబాద్ 89.45 శాతం, జగిత్యాల 89.60 శాతంతో ముందంజలో ఉన్నాయి. మరోవైపు హైదరాబాద్ జిల్లా 58.58 శాతంతో చివరి స్థానంలో ఉండగా.. మేడ్చల్--మల్కాజిగిరి 63.82 శాతం, రంగారెడ్డి 64.91 శాతం వద్ద ఉన్నాయి. ఇప్పటికే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో సర్ ప్రక్రియకు రెండుసార్లు గడువు పొడిగించినప్పటికీ డిజిటలైజేషన్‌లో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించలేదని అధికారులు గుర్తించారు. తుది గడువు సమీపించడంతో మిగిలిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను పూర్తి చేసేందుకు అధికారులు దృష్టి సారించారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఈ డిజిటలైజేషన్ కీలకంగా మారింది.

## నర్సాపూర్‌లో శాఖాహార ర్యాలీ..

**శాఖాహారం.. ధ్యానం.. ఆరోగ్యకర జీవనం.. అంటూ అవగాహన**

**నర్సాపూర్‌లో పిరమిడ్ సొసైటీస్ ఆధ్వర్యంలో ఘనంగా శాఖాహార ర్యాలీ**

**ఆటపాటలతో ప్రధాన పురవీధుల్లో కొనసాగిన ప్రదర్శన**

**శాఖాహారం, ధ్యానం, జీవకారుణ్యంపై ప్రజలకు అవగాహన**



**నర్సాపూర్, ఆగస్టు 09 (నేటి ప్రస్థానం):** జంతువుల పట్ల దయ, కరుణ చూపుతూ జీవకారుణ్యాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని పిరమిడ్ సొసైటీస్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. శాఖాహారం, ధ్యానం ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవచ్చని సూచించారు. ఈ సందేశంతో మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీ పట్టణంలో పిరమిడ్ సొసైటీస్ ఆధ్వర్యంలో శాఖాహార ర్యాలీ నిర్వహించారు. ప్రధాన పురవీధుల గుండా ఆటపాటలతో సాగిన ర్యాలీ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిరమిడ్ వ్యవస్థాపకులు సత్యనారాయణ లక్ష్మి, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్ మాట్లాడుతూ.. మాంసాహారానికి దూరంగా ఉండి శాఖాహారాన్ని స్వీకరించాలని, జంతుబలిని పూర్తిగా నివారించాలని కోరారు. ప్రతిరోజూ ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చని, 'శ్వాసపై ధ్యాస'తో ధ్యానం చేస్తే ఒత్తిడిని తగ్గించుకోవచ్చని తెలిపారు. శాఖాహారం, ధ్యానాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ సొసైటీస్ ప్రతినిధులు, సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## చెట్ల కొమ్మలు తొలగించి...

## ప్రమాదాలను నివారించాలి

**అల్లాదుర్గం అల్లాదుర్గం:** మండలంలోని గొల్ల కుంట తండాకు వెళ్లే రహదారికి వెంబడి ఉన్న హరితహారం చెట్ల కొమ్మలు వేపుగా పెరిగి తండా వాసులకు ఇబ్బంది కరంగా మారింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుండా ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. రోడ్డు పక్కకు పిచ్చి మొక్కలు సైతం పెరిగి పోయింది. పంచాయతీ పాలకవర్గం వెంటనే స్పందించి వేపుగా పెరిగిన చెట్ల కొమ్మలను ,పిచ్చి మొక్కలను తొలగించాలని తండా వాసులు కోరుతున్నారు.



# ప్రజల ముందు ఎవ్వరైనా తలవంచాల్సిందే.. టీపీసీసీ చీఫ్ కీలక వ్యాఖ్యలు

**క్విట్ ఇండియా స్ఫూర్తితోనే ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడాలి: మహేశ్ కుమార్ గౌడ్**

**రాజ్యాంగానికి తూట్లు పొడిచే వారికి 'క్విట్' చెప్పాలని సూచన**

**యువత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను తెలుసుకోవాలన్న టీపీసీసీ చీఫ్**

హైదరాబాద్, ఆగస్టు 09 (నేటి ప్రస్థానం): ప్రజాస్వామ్యంలో ఎంతటి వారైనా ప్రజల ముందు మెడలు వంచక తప్పదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచే వారికి 'క్విట్' చెప్పాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నాంపల్లిలోని గాంధీ భవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. క్విట్ ఇండియా ఉద్యమం భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలక ఘట్టమని, ఆ ఉద్యమ స్ఫూర్తిని నేటి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ వంటి నాయకుల స్ఫూర్తితో సాగిన ఉద్యమంలో వేలాది మంది



ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం గాంధీ, నెహ్రూలను చరిత్ర నుంచి మరిపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అవే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకువస్తాయని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రతిపక్షాలు సద్విమర్శలు చేయాలని, అసత్య ప్రచారాలకు దూరంగా ఉండాలని సూచించారు. 'సర్' ప్రక్రియలో అర్హులైన ఓట్ల తొలగింపును అడ్డుకుంటున్నామని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతున్నామని తెలిపారు.



## బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి..

**అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు**

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాలు ప్రతీక: ఎమ్మెల్యే**

**గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించిన సునీతా లక్ష్మారెడ్డి**

**భక్తిశ్రద్ధలతో ఘనంగా బోనాల వేడుకలు**



**మెదక్, ఆగస్టు 09 (నేటి ప్రస్థానం):** శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న.. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి గ్రామదేవతలకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. అమ్మవారికి బోనాలు సమర్పించిన అనంతరం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని కొనియాడారు. ఇక బోనాల వేడుకల సందర్భంగా స్థానికంగా సందడి వాతావరణం నెలకొంది. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

## రామడుగు లో 66వ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

**రామడుగు, ఆగష్టు 09 :** రామడుగు మండల యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు అనుపురం పరశురామ్ గౌడ్ ఆధ్వర్యంలో రామడుగు మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ చేసి అనంతరం కేక్ కట్ చేసి యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం డైరెక్టర్ మామిడి దిలీప్ కుమార్, యువజన కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్,పల్లె రామ్ రెడ్డి,సిరికొండ సాయి తేజ, యువజన కాంగ్రెస్ మండల సోషల్ మీడియా కన్వీనర్ మిల్కి , ఎన్ఎస్యుఐ మండల అధ్యక్షులు జవ్వాజి అజయ్, పూరేళ్ళ రాహుల్,రామ్ ప్రసాద్,శేఖర్,హరిచరన్ , శ్రీనివాస్, విజయ్, మణి ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లేశం మరియు యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు





## ఘనంగా సుశీలమ్మ ఫౌండేషన్ చైర్మన్ కోమటిరెడ్డి లక్ష్మి రాజ్ గోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు



**సశీస్థాన్ నారాయణపురం, :** సుశీలమ్మ ఫౌండేషన్ చైర్మన్ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సతీమణి కోమటిరెడ్డి లక్ష్మి రాజ్ గోపాల్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు నారాయణపురం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నల్గొండ జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నారాయణపురం మండల అధ్యక్షుడు రెడ్యా నాయక్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గం, నారాయణపురం మండల యువజన కాంగ్రెస్ కమిటీ మండల వ్యాప్తంగా యువజన కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నిస్వార్థం గా ఎన్నో సేవ కార్యక్రమలు నిర్వహిస్తున్న కోమటిరెడ్డి లక్ష్మి రాజ్ గోపాల్ రెడ్డి నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో ఉండి ప్రజలకు సేవ చేయాలని కోరారు...నారాయణపురం మండల యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు

## ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడిగా ప్యారపు శివకృష్ణ నియామకం





**ఆలేరు: ఆగస్టు 9 :** ఆలేరు మండలం భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడిగా శాయిగూడెం గ్రామానికి చెందిన ప్యారపు శివకృష్ణను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు ప్యారపు శివకృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఆలేరు నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు, ఎస్సీ మోర్చాను గ్రామస్థాయి నుంచి పటిష్టంగా నిర్మించేందుకు తనవంతు కృషి చేస్తానని శివకృష్ణ తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వం, పార్టీ నాయకుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా ఎస్సీ వర్గాల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పనిచేస్తానని పేర్కొన్నారు.తన నియామకానికి సహకరించిన యాదాద్రి భువనగిరి జిల్లా బీజేపీ అధ్యక్షులు ఊటుకూరి అశోక్ గౌడ్, ఆలేరు మండల అధ్యక్షులు పూజారి కుమారస్వామి గౌడ్, జిల్లా కార్యదర్శి కమిటీకారి కృష్ణన్నకు శివకృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ఆలేరు మండలంలో బీజేపీకి మరింత బలం చేకూర్చేందుకు కృషి చేస్తానని, రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకివిస్తృతంగాతీసుకెళ్తానని శివకృష్ణ స్పష్టం చేశారు.

## తుర్కపల్లిలో నూతన తిరుమల ఫ్యామిలీ రెస్టారెంట్ ఓపెన్ చేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**తుర్కపల్లి ఆగస్ట్ 09 :** తుర్కపల్లి మండలంలోని తిరుమలాపూర్ వాస్తవ్యులు తోకల శోభ వెంకటేష్ యాదవ్, తుర్కపల్లి మండల కేంద్రంలోని గజ్వేల్ రోడ్ శివ శివాని ఐటిఐ కాలేజ్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన తిరుమల ఫ్యామిలీ రెస్టారెంట్ ను ఎం ఎల్ ఏ,ప్రభత్వ విప్ బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో ప్రారంభించారు ఆయన మాట్లాడుతూ,భోజనం విషయంలో నాణ్యమైన భోజనం అందించాలని , అలాగే ప్రజలకు అందుబాటు ధరల్లో భోజనం అందించేందుకు ఏర్పాటు చేయాలని కోరారు, అనంతరం తోకల శోభా వెంకటేష్ యాదవ్,మాట్లాడుతూ ,భోజనం విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు తగిన ఏర్పాట్లు చేశామని,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యత విషయంలో లోపాలు లేకుండా ప్రజలకు మంచి ఆహారాన్ని అందించాలనే సంకల్పంతో,ఈ రెస్టారెంట్ ఏర్పాటు చేశామని తెలిపారు,ఈ కార్యక్రమంలో పాల్గొన్న,ఆలేరు మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్యమహేందర్ రెడ్డి,పీఏసీఎస్ చైర్మన్ ధనావత్ శంకర్ నాయక్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,తుర్కపల్లి ఎస్ ఐ శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లపై కీలక అప్డేట్..

**20న లాటరీ.. ఎవరికి దక్కనున్నాయంటే?..హైదరాబాద్‌లో తొలి విడతగా 7,340 ఇళ్ల కేటాయింపు**

**ఆగస్టు 10తో దరఖాస్తుల గడువు పూర్తి.. ఇప్పటికే 35,125 దరఖాస్తులు.. మరింత పెరిగే అవకాశం**

**అర్హుల ఎంపిక తర్వాత లాటరీ ద్వారా లబ్ధిదారుల నిర్ణయం**

**అర్హతల పరిశీలన తర్వాత ఈ నెల 20న లాటరీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక**

**హైదరాబాద్, ఆగస్టు 09 (నేటి ప్రస్థానం):** హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం కీలక అప్డేట్ ఇచ్చింది. ఆగస్టు 10తో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనుండగా.. ఇప్పటివరకు 35,125 దరఖాస్తులు అందాయి. దరఖాస్తుల పరిశీలన, అర్హతల నిర్ధారణ పూర్తయిన తర్వాత ఈ నెల 20న లాటరీ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులు నిర్ణయించారు. హైదరాబాద్ పరిధిలోని 16 నియోజకవర్గాల్లో తొలి విడతగా 7,340 ఇళ్లను కేటాయించనున్నారు. ఆగస్టు 10 వరకు గడువు ఉండటంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నియోజకవర్గాల వారీగా చూస్తే.. కూకట్‌పల్లి నుంచి అత్యధికంగా 5,233 దరఖాస్తులు వచ్చాయి. ఖైరతాబాద్‌లో 4,394, కుత్బుల్లాపూర్‌లో 4,121, నాంపల్లిలో 3,613, మలక్‌పేటలో 2,846, శేరిలింగంపల్లిలో 2,530, అంబర్‌పేటలో 2,357, కార్వాన్‌లో 1,574, రాజేంద్రనగర్‌లో 1,496, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో 1,374, మేడ్చల్‌లో 1,153, బహదూర్‌పురలో 1,135, సనత్‌నగర్‌లో 1,046, మల్కాజ్‌గిరిలో 1,033 దరఖాస్తులు నమోదయ్యాయి. తొలి విడతలో కేటాయించే ఇళ్ల కంటే దరఖాస్తులు సుమారు నాలుగున్నర రెట్లు అధికంగా ఉన్నాయి. ఇళ్లు మంజూరు కాని వారికి దరఖాస్తు ఫీజుగా చెల్లించిన రూ.10,000 తిరిగి




చెల్లించనున్నట్లు అధికారులు తెలిపారు. సందేహాల నివృత్తి కోసం 040-24603572 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మొత్తం లక్ష ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ స్థలాలను ఇప్పటికే గుర్తించిన అధికారులు.. ఆయా ప్రాంతాల్లో భవన సముదాయాల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు నిర్మాణాలను ఏడాదిలోగా పూర్తి చేసి అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# బోనాల వేడుకలలో ఫ్లెక్సీ వార్..

**గోమారంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల ఘర్షణ**

**గోమారంలో బోనాల పండుగ సందర్భంగా ఫ్లెక్సీల ఏర్పాటు**

**బీఆర్ఎస్ ఫ్లెక్సీకి అడ్డుగా కాంగ్రెస్ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారని వివాదం**

**మాటామాటా పెరగడంతో పరస్పరం ఘర్షణకు దిగిన ఇరు వర్గాలు**

**రంగంలోకి దిగిన పోలీసులు.. అదుపులోకి వచ్చిన పరిస్థితి**



**మెదక్, ఆగస్టు 09 (నేటి ప్రస్థానం):** బోనాల పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు రాజకీయ ఘర్షణకు దారితీశాయి. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య ఫ్లెక్సీల ఏర్పాటు విషయంలో వివాదం చెలరేగింది. దీంతో కొద్దిసేపు గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బోనాల పండుగను పురస్కరించుకుని బీఆర్ఎస్ నాయకులు గ్రామంలో ఓ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అయితే ఆ ఫ్లెక్సీకి అడ్డుగా కాంగ్రెస్ నాయకులు మరో ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో ఇరు వర్గాల మధ్య వివాదం మొదలైనట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఇరువర్గాల మధ్య మాటామాటా పెరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారి పరస్పరం ఘర్షణకు దిగినట్లు తెలుస్తోంది. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే గ్రామానికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా పోలీసులు అక్కడే ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో పరిస్థితి అదుపులో ఉన్నట్లు సమాచారం. అయితే ఘర్షణకు అసలు కారణం ఏమిటి? ఘటనలో ఎంతమంది పాల్గొన్నారు? ఎవరైనా గాయపడ్డారా? ఈ వ్యవహారంలో కేసులు నమోదయ్యాయా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

# రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం**

గట్టుప్పల్ ఆగస్టు. 9. గట్టుపల్. మండల. కేంద్రంలోని ఎస్. వి ఫంక్షన్ హాల్లో. మునుగోడు నియోజకవర్గ స్థాయి సిపిఎం రాజకీయ శిక్షణ తరగతులు ఈనెల 25, 26 తేదీలలో గట్టుపల్ మండల కేంద్రంలోని ఎస్. వి ఫంక్షన్ హాల్లో జరుగుతున్నాయని, ఈ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం అన్నారు. ఆదివారం చండూరు మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో సిపిఎం గ్రామ శాఖ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ శిక్షణ తరగతులలో మునుగోడు నియోజకవర్గ మౌలిక సమస్యలపై కార్యచరణ రూపొందించబడుతుందని ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కోసం నిరంతరం పోరాడుతున్నామని, నియోజకవర్గ కేంద్రంలో మారుమూల గ్రామాలకు రోడ్ల నిర్మాణం చేసి బస్సు సౌకర్యం కల్పించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, అన్ని రకాల పింఛన్లు అందించాలన్నారు. నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులు నత్త నడకగా సాగుతున్నాయని, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం లౌకిక ప్రజాస్వామిక హక్కుల కోసం ప్రజలు సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 10న మునుగోడు నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ జైల్ భరో కార్యక్రమానికి కార్మికులు,




రైతులు, వ్యవసాయ కార్మికులు, కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ, సిపిఎం కొండాపురం గ్రామ శాఖ కార్యదర్శి కొత్తపల్లి నరసింహ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వరికుప్పల ముత్యాలు, బిక్షం తదితరులు పాల్గొన్నారు.




## రూ.949లకే ఏఐ అసిస్టెంట్ ఫోన్

సామాన్యులకు సైతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చౌకగా అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో ప్రముఖ మొబైల్ బ్రాండ్ 'ఐటెల్' భారత మార్కెట్లో సరికొత్త 'ఏస్ 3 హీరా' ఫీచర్ ఫోన్‌ను ఆవిష్కరించింది. కేవలం రూ.949 ధరకే లభించే ఈ డివైజ్ ఫీచర్ ఫోన్ విభాగంలో డిజిటల్ సౌలభ్యానికి అందిస్తున్నట్లు కంపెనీ చెప్పింది. ఈ కొత్త ఫోన్ విడుదలతో భారతదేశంలో తన పూర్తి ఫీచర్ ఫోన్ పోర్ట్‌ఫోలియోను యూఎస్‌బీ టైప్-సీ చార్జింగ్‌కు మార్చినట్లు తెలిపింది. స్మార్ట్‌ఫోన్‌లు, ఫీచర్ ఫోన్‌లకు వేర్వేరు చార్జర్లు వాడే ఇబ్బందిని తప్పించి ఒకే కేబుల్‌తో ప్రతి ఒక్కరూ చార్జింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించడమే తమ ముఖ్య ఉద్దేశమని కంపెనీ సీఈఓ అరిజీత్ తలపాత్రా పేర్కొన్నారు. కంపెనీ తెలిపిన వివరాల ప్రకారం.. 1,000ఎంఏహెచ్ బ్యాటరీతో పాటు ఏఐ బ్యాటరీ ఆప్టిమైజేషన్, సూపర్ బ్యాటరీ మోడ్ ఫీచర్లు ఉన్నాయి. రికార్డింగ్ ఆప్షన్‌తో కూడిన వైర్‌లెస్ ఎఫ్ఎమ్ రేడియో, ఆటో కాల్ రికార్డింగ్, బ్లూటూత్ సదుపాయాలు ఉన్నాయి. ఇంగ్లీష్, హిందీ భాషలకు మద్దతు ఇచ్చే 'కింగ్ టాకర్'(టెక్స్ట్-టు-స్పీచ్) ఏఐ అసిస్టెంట్‌ను అందించారు.

## పెట్రోల్ సేఫేనా?.. 87 వేల పెట్రోల్ బంకుల్లో తనిఖీలు!




ఇథనాల్ కలిపిన పెట్రోల్ నాణ్యత, కల్తీ అయ్యే అవకాశంపై ఆందోళనలు వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో చర్చ మొదలైన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఇంధనంలో కల్తీ లేదా నాణ్యత లోపాలు ఉన్నాయన్న ప్రచారాన్ని దృష్టిలో పెట్టుకుని, దేశవ్యాప్తంగా కఠినమైన నాణ్యత నియంత్రణ చర్యలు అమలు చేస్తున్నామని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ప్రజలకు అందించే పెట్రోల్ నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నామని, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రతి దశలో పరీక్షలు నిర్వహిస్తున్నాయని ప్రభుత్వం తెలిపింది. సాధారణ తనిఖీలతో పాటు.. ఎలాంటి కల్తీ జరగకుండా అదనపు పరీక్షలు కూడా చేపడుతున్నట్లు వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఉన్న 87 వేలకు పైగా పెట్రోల్ బంకుల్లో.. రోజుకు 8 నుంచి 12 సార్లు నీటి కలయిక ఉందా.. లేదా?, అనే పరీక్షలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా.. పెట్రోల్‌లో కలుషితాలు ఉన్నాయా?, లేదా? అని తెలుసుకోవడానికి 2 వేలకు పైగా ఇంధన నమూనాలను పరీక్షించారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా కేవలం రెండు చోట్ల మాత్రమే క్లోరైడ్ కలుషిత సమస్యలు బయటపడగా, వెంటనే ఆ పెట్రోల్ బంకుల్లో విక్రయాలను నిలిపివేసినట్లు కూడా కేంద్రం వెల్లడించింది. ఈ20 పెట్రోల్ నాణ్యత అనేది వాహనం ట్యాంక్‌కు చేరిన తర్వాత మాత్రమే పరిశీలించేది కాదని కేంద్రం తెలిపింది. ఇథనాల్ తయారీ దశ నుంచే నాణ్యత తనిఖీలు ప్రారంభమవుతాయని పేర్కొంది. ముందు ఇథనాల్ నాణ్యతను పరిశీలిస్తారు. డిస్టిలరీల నుంచి వచ్చే ప్రతి బ్యాచ్ ఎథనాల్ దీ×ూ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. దాని స్వచ్ఛత కనీసం 99.6 శాతం ఉండటం తప్పనిసరి. ఇథనాల్‌ను ఆయిల్ కంపెనీల డిపోలకు పంపే సమయంలో నాణ్యత ధ్రువీకరణ పత్రం కూడా అందజేస్తారు. నాణ్యత ప్రమాణాలు పాటించని ఇథనాల్‌ను.. సరఫరా వ్యవస్థలోకి అనుమతించడం లేదని ప్రభుత్వం తెలిపింది. 2024 జూలై నుంచి 2026 జూన్ మధ్య కాలంలో 302 ట్యాంకర్లలో వచ్చిన దాదాపు 10,500 కిలోలీటర్ల ఇథనాల్‌ను ప్రమాణాలు సరిపోకపోవడంతో తిరస్కరించారు. ఇందులో స్వచ్ఛత, నీటి శాతం, సాంద్రత వంటి అంశాల్లో లోపాలను గుర్తించారు. ఇథనాల్ నిల్వ, రవాణా సమయంలో కూడా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇతర పదార్థాలతో కలవకుండా.. ప్రత్యేక నిల్వ కేంద్రాల్లో ఉంచుతున్నారు. డిపోలకు చేరిన ప్రతి ట్యాంకర్ నుంచి పైభాగం, కింది భాగం నుంచి నమూనాలు తీసుకుని పరీక్షించిన తర్వాతే ఆమోదిస్తున్నారు.

## హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ క్లౌడ్

న్యూఢిల్లీ, ఆగస్టు 6 : టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్.. దేశంలో తమ నాల్గో క్లౌడ్ రీజియన్‌ను హైదరాబాద్‌లో అందుబాటులోకి తెచ్చినట్టు గురువారం ప్రకటించింది. దీంతో నగరం నుంచి వీలైన మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సేవలు, వర్క్‌లోడ్‌లను నడిపించడానికి ఇక కస్టమర్లకు అవకాశం లభించిందని పేర్కొన్నది. ఇప్పటికే కంపెనీకి పుణె, చెన్నై, ముంబైలు క్లౌడ్ రీజియన్‌లుగా ఉన్నాయి. దీంతో ఇప్పుడు వీటికి హైదరాబాద్ తోడైంది. కాగా, భారత్‌లో 20.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులను పెట్టేందుకు సిద్ధమైన మైక్రోసాఫ్ట్.. అందులో భాగంగానే ఈ క్లౌడ్ రీజియన్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది.




# పసిడి పరుగో.. పరుగు

### ఒక్కరోజే రూ.3,800 పెరిగిన తులం ధర

న్యూఢిల్లీ, ఆగస్టు 6: బంగారం ధరలు వరుసగా మూడోరోజూ పెరిగాయి. గురువారం ఒక్కరోజే ఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల రేటు రూ.3,800 ఎగిసింది. దీంతో 7 వారాల గరిష్ఠ స్థాయిని తాకుతూ రూ.1,53,800కు చేరింది. జూన్ 18 (రూ.1,53,400) తర్వాత ఇదే అత్యధికం మరి. అంతకుముందు రెండు రోజుల్లో రూ.2,600 పెరిగిన విషయం తెలిసిందే. ఇక వెండి ధరల విషయానికొస్తే.. రూ.2,100 పుంజుకొని కిలో రూ.2,34, 800 పలికింది. బుధవారం రూ.6,200 ఎగబాకిన సంగతి విదితమే. కాగా, హైదరాబాద్‌లో 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) 10 గ్రాముల విలువ రూ.2,650 పెరిగి రూ. 1,37,250గా ఉన్నది. బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు మళ్లీ పెరుగుతూపోతుండటం వెనుక అనేక కారణాలున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో నెలకొన్న అశాంతి తొలగిపోతుండటం, హొర్ముజ్ జలసంధిలో తిరిగి నౌకల రవాణాకు మార్గం సుగమమయ్యే అవకాశాలు కనిపిస్తుండటం, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పడుతుండటం ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయని మార్కెట్ విశ్లేషకులు చెప్తున్నారు. క్రూడాయిల్ రేట్లు దిగితే ద్రవ్యోల్బణం భయాలు తొలగిపోనుండటం, తద్వారా అమెరికా ఫెడ్ రిజర్వ్, ఆర్బీఐ సహా ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకులు వడ్డీరేట్ల పెంపు జోలికి వెళ్లవన్న అంచనాలు మదుపర్లలో నెలకొనడం కూడా గోల్డ్, సిల్వర్‌కు డిమాండ్‌ను తెచ్చిపెడుతున్నదని అంటున్నారు. అలాగే డాలర్ విలువ, అమెరికా బాండ్ రాబడులు సైతం మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నట్టు గుర్తుచేస్తున్నారు.



**అంతర్జాతీయ మార్కెట్‌లో..**

అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ 4,264.24 డాలర్లు పలికింది. సిల్వర్ 61.80 డాలర్ల వద్ద నిలిచింది. మరోవైపు ఫ్యూచర్ మార్కెట్‌లోనూ బంగారం ధరలు దూసుకుపోతున్నాయి. గురువారం మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)పై అక్టోబర్ డెలివరీకిగాను రూ.654 పెరిగి రూ.1,49,147 వద్ద ట్రేడైంది. మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలు తగ్గుముఖం పడితే అటు స్పాట్ మార్కెట్‌లో, ఇటు ఫ్యూచర్ మార్కెట్‌లోనూ ధరలు పరుగులు పెట్టడం ఖాయమని ట్రేడర్లు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది జనవరి 29న దేశీయంగా 24 క్యారెట్ గోల్డ్ తులం మునుపెన్నడూ లేనివిధంగా రూ.1,83,000 పలికినది తెలిసిందే. కిలో వెండి తొలిసారి రూ.4,04,500గా నమోదైంది. అయితే గల్ఫ్ వార్ దెబ్బకు బంగారం ధర దాదాపు రూ.40,000 వరకు, వెండి రేటు సుమారు రూ.1,80,000 వరకు క్షీణించాయి.

# కేకేఆర్ చేతికి మెడికవర్ ఇండియా




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత హెల్త్‌కేర్ విభాగంలో అవకాశాలను మరింతగా అందిపుచ్చుకునే దిశగా గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం కేకేఆర్ తాజాగా భారీ డీల్‌కి తెరతీసింది. అంతర్జాతీయ వైద్యసేవల దిగ్గజం మెడికవర్ ఏబీకి చెందిన భారత విభాగం మెడికవర్ ఇండియాను కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ డీల్ విలువ ఎంతనేది కేకేఆర్ నిర్దిష్టంగా వెల్లడించకపోయినప్పటికీ.. సంస్థ విలువను 1.2 బిలియన్ యూరోలుగా (దాదాపు రూ. 13,200 కోట్లు) లెక్కగట్టినట్లు న్యాయ సలహాలందిస్తున్న ట్రైలీగల్ వివరించింది. కేకేఆర్‌కి చెందిన ఫండ్స్‌కి 100 శాతం వాటాలను విక్రయించేందుకు తమతో పాటు మైనారిటీ వాటాదారులు ఒప్పందం కుదుర్చుకున్నట్లు మెడికవర్ తెలిపింది. దీనితో స్థూలంగా 740 మిలియన్ యూరోలు లభిస్తాయని, ఆ మొత్తంతో పోలాండ్ తదితర దేశాల్లో కార్యకలాపాలు విస్తరించనున్నట్లు పేర్కొంది. ఈ డీల్‌కి ఇదే సరైన సమయమని భావిస్తున్నట్లు కంపెనీ సీఈవో జాన్ స్టబింగ్‌టన్ చెప్పారు. మరోవైపు ప్రస్తుత మేనేజ్‌మెంటే మరో మూడేళ్ల పాటు కొనసాగుతుందని మెడికవర్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరికృష్ణ వెల్లడించారు. సంస్థలో 14 వేల మంది ఉద్యోగులు, 1,900 మంది పైగా డాక్టర్లు ఉన్నారని, వారు కూడా యథాప్రకారంగానే కొనసాగుతారని పేర్కొన్నారు. సంస్థను మరింతగా విస్తరించే ప్రణాళికలు ఉన్నట్లు వివరించారు. నియంత్రణ సంస్థల అనుమతులకు లోబడి ఈ ఏడాది ఆఖరు నాటికి ఇది పూర్తి కావొచ్చని భావిస్తున్నట్లు వివరించారు. ప్రస్తు తం ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకలో మొత్తం నాలుగు రాష్ట్రాల్లో సుమారు 11--12 లక్షల మంది పేషంట్లకు చికిత్సలు అందిస్తున్నట్లు చెప్పారు. అటు, 'మరింత నాణ్యమైన వైద్య సేవలందించడంలో మెడికవర్ ఇండియా డాక్టర్లు, ఉద్యోగులకు మద్దతుగా నిలుస్తూ, దేశవ్యాప్తంగా అధునాతన హెల్త్‌కేర్ సర?వసులను విస్తరించేందుకు ఈ పెట్టుబడులు దోహదపడతాయి' అని కేకేఆర్ పార్ట్‌నర్ అక్షయ్ తనా తెలిపారు.

**నాలుగు రాష్ట్రాల్లో 24 ఆస్పత్రుల నెట్‌వర్క్..**

మ్యాక్స్‌క్యూర్ హాస్పిటల్ చెయిన్ ఆపరేటర్, హైదరాబాద్‌కి చెందిన సహృదయ హెల్త్‌కేర్‌లో నియంత్రణాధికారాలుండే వాటాలను కొనుగోలు చేయడం ద్వారా స్వీడన్‌కి చెందిన మెడికవర్ 2017లో భారత హెల్త్‌కేర్ మార్కెట్లోకి ప్రవేశించింది. మెడికవర్ ఇండియాలో మెడికవర్ హోల్డింగ్స్ బీవీకి 67 శాతం ఉండగా, మైనారిటీ షేర్‌హోల్డర్లయిన ప్రస్తుత సీఎండీ జి. అనిల్ కృష్ణ తదితరుల వద్ద సుమారు 33 శాతం వాటాలు ఉన్నాయి. సంస్థలో పి. హరికృష్ణ, ఎ. శరత్ రెడ్డి ఈడీలుగా, ఏఆర్ కృష్ణప్రసాద్ డైరెక్టరుగా ఉన్నారు. సుమారు 4,800 పడకలతో 24 ఆస్పత్రుల నెట్‌వర్క్ ఉంది. 80 పైచిలుకు స్పెషాలిటీల్లో సేవలు అందిస్తోంది.

**భారీ విస్తరణ బాటలో కేకేఆర్**

కేకేఆర్ 2004 నుంచి అంతర్జాతీయంగా హెల్త్‌కేర్ విభాగంలో సుమారు 20 బిలియన్ డాలర్ల పైగా ఇన్వెస్ట్ చేసింది. గత కొన్నాళ్లుగా భారత్‌లోనూ విస్తరించింది. మ్యాక్స్ హెల్త్‌కేర్‌లో భారీ లాభాలకు నిష్క్రమించిన దాదాపు నాలుగేళ్ల తర్వాత 2025లో కేరళకు చెందిన బేబీ మెమోరియల్ హాస్పిటల్ (బీఎంహెచ్)లో దాదాపు రూ. 2,500 కోట్లకు సుమారు 70 శాతం వాటాలను కొనుగోలు చేయడం ద్వారా మళ్లీ హెల్త్‌కేర్ విభాగంలోకి ప్రవేశించింది. అప్పటి నుంచి దక్షిణాది మరింతగా కార్యకలాపాలు విస్తరించింది. మైత్రా హాస్పిటల్, చళికట్టు మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను కొనుగోలు చేసింది. అలాగే హెల్త్‌కేర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్‌లో నియంత్రణాధికారాలున్న వాటాలను దక్కించుకుంది. ఈ విభాగంలో ఫైనాన్సింగ్ కార్యకలాపాలు కూడా నిర్వహిస్తోంది.

# టాటా నెక్సాన్ కొత్త ఎడిషన్ లాంచ్: ధర ఎంతంటే?

భారతదేశంలో అత్యధిక అమ్మకాలు పొందుతున్న నెక్సాన్.. 'కామో ఎడిషన్' రూపంలో లాంచ్ అయింది. దీని ధర రూ.9.99 లక్షలు (ఎక్స్-షోరూమ్). దీనికి కంపెనీ పరిమిత సంఖ్యలో మాత్రమే విక్రయించనుంది. భారతదేశంలో నెక్సాన్ తొమ్మిదేళ్లు పూర్తి చేసుకుని, 11 లక్షలకు పైగా అమ్మకాలను సాధించిన సందర్భంగా.. ఈ కాంపాక్ట్ ఎస్‌యూవీని టాటా మోటార్స్ లాంచ్ చేసింది. అయితే ఇందులో ఎలాంటి మెకానికల్ మార్పులు లేదు, కానీ కొన్ని కాస్మెటిక్ అప్‌డేట్‌లు కొన్ని అదనపు పరికరాలను జోడించారు. నెక్సాన్ కామో ఎడిషన్ మున్నార్ మిస్ట్, కూర్గ్ క్లౌడ్ అనే రెండు కొత్త రంగుల్లో లభిస్తుంది. ఈ రంగులు కాకుండా కామో బ్యాడ్జ్‌లు కనిపిస్తాయి. క్యాబిన్‌లో కూడా ముందు సీట్ల హెడ్‌రెస్ట్‌లపై కామో థీమ్ ఉంటుంది. క్యాబిన్ లోపల 10.25-అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌తో కూడిన కొత్త 12.3-అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్‌ను అందించారు. మరో ముఖ్యమైన ఫీచర్ ఏమిటంటే.. ఈ కారులోని నాలుగు సరౌండ్-వ్యూ కెమెరాలను ఉపయోగించి పనిచేసే ఇంటిగ్రేటెడ్ డాష్‌క్యామ్. ఇది నిరంతరంగా రికార్డ్ చేయగలదు, ప్రమాదం జరిగినప్పుడు ఫుటేజీని ఆటోమేటిక్‌గా సేవ్ చేస్తుంది, వీడియోలను ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్‌పై చూడటానికి లేదా స్మార్ట్‌ఫోన్‌కు బదిలీ చేయడానికి అనుమతిస్తుంది. వేరియంట్‌ను బట్టి.. పరికరాల జాబితాలో పనోరమిక్ సన్‌రూఫ్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, బ్లైండ్ వ్యూ మానిటర్‌తో కూడిన 360-డిగ్రీ కెమెరా, జేబీఎల్ స్పీకర్ ఆడియో సిస్టమ్, వైర్‌లెస్ ఛార్జర్, కనెక్టెడ్ కార్ టెక్నాలజీ మొదలైనవి ఉన్నాయి. ఏడు ఫంక్షన్లతో కూడిన ఏడీఏఎస్ మాత్రమే కాకుండా.. ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రాం కూడా ఉన్నాయి. నెక్సాన్ కామో ఎడిషన్.. స్టాండర్డ్ మోడల్‌లో ఉన్న అవే ఇంజన్ ఆప్షన్‌లతో కొనసాగుతుంది. కొనుగోలుదారులు 1.2-లీటర్ టర్బో-పెట్రోల్ ఇంజన్, 1.5-లీటర్ డీజిల్, 1.2-లీటర్ టర్బో సీఎన్జీ యూనిట్ వంటి వాటిలో ఎంచుకోవచ్చు. వేరియంట్‌ను బట్టి, ట్రాన్స్‌మిషన్ ఆప్షన్‌లలో మాన్యువల్, ఆటోమాటిక్, డ్యూయల్ క్లచ్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌లు ఉన్నాయి.

